ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీ శ్రీధర



రాయటం వచ్చినవాళ్ళు ఎవరైనా కథలు రాయవచ్చు. అదో పెద్ద విశేషమేకాదు. కథ రాయటానికి ముఖ్యంగా కావల్సినవి రెండు. కాగితం, కలం. అవునండి- మంచికథ రాయటానికి ఇంకో రెండు కావాలి. "థాట్" 'ప్రెజెంటేషన్' ఏం చెప్పదల్చుకున్నామో దానిమీద క్లారిటీ ఉండాలి. చెప్పదల్చుకున్న విషయాన్ని కొంచెంగా అందంగా చెప్పగలిగాలి. అప్పుడు ఆ కథ బావుందనిపిస్తుంది.

ఈ వారం ఈ శీర్షికకు వచ్చిన డెబ్బయి రెండు కథలు చదివాక, పైరెండు ముక్కలూ చెప్పాలనిపించింది. ప్రకాశ్‌చేత మోసపోవటం, తర్వాత ఎప్పుడో పెళ్ళిచూపులకు వస్తోందని ప్రకాశ్ అని తెల్సి, ఆ ప్రకాష్, ఈ ప్రకాష్ ఒకడుకాకూడదని అనుకోవటం—చాలా మందికి ఇదే కథావస్తువు అయింది.

శ్రీధర్ సెక్రటేరియేట్‌లో పనిచేస్తున్నారు. అనేక కథలు, నవలలు రాశారు. ఈయన చక్కటి జోకులతో నవ్విస్తుంటాడు.

స్రవంతి నెం. 25లో ఇచ్చిన
'ఆ ప్రకాశ్, ఈ ప్రకాశ్ ఒకడేనా?' కాకుంటే బావుండునని మనస్సులో అనుకుంటూ నడుస్తోంది జానకి.
వాక్యం ఆధారంగా రాసిన కథలు

# నిజం తెలిస్తే...?

ఉదయం 8 గం|| అయింది. హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చింది. అర్జంటు కేసుందని వెంటనే రమ్మని. డాక్టరు జానకికి వచ్చిన ఫోను అది. వెంటనే జానకి కారులో హాస్పిటల్‌కు బయలుదేరింది. హాస్పిటల్ చేరిన వెంటనే పేషెంట్ గదిలోకెళ్ళి అతన్ని పరీక్షించింది. కొన్ని రిపోర్ట్స్ వస్తేగాని, ఖచ్చితమైన చికిత్స చేయటానికి కుదరదు. అది సాటి డాక్టర్‌తో అంది. ఆ పేషెంట్ దగ్గర ఒక్క స్నేహితుడు తప్ప మరే బంధువులు లేరు.

"చాలా రోజులుగా అనారోగ్యంగా ఉన్నాడు తగిన మందులు తీసుకోకుండా, నేనెంత చెప్పినా వినకుండా నిర్లక్ష్యం చేశాడు" అని అన్నాడు అతని మిత్రుడు.

ఆ పేషెంటు పేరు ప్రకాష్ అని, అతను వైజాగ్‌లో బ్యాంక్‌లో జాబ్ చేస్తాడని, ఎప్పుడూ చాలా నిరుత్సాహంగా, జీవితంలో ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటాడని, ఇంకా ఏమో... ఏమో చెప్పాడు అతని ఫ్రెండు.

ప్రకాష్ అన్న పేరు వినగానే జానకి నెర్వస్‌గా ఫీలయింది. మనస్సులోనే "ప్రకాష్ ప్రకాష" అని నాలుగయిదుసార్లు అనుకుంది. ఆ పేరుకు తనకూ గల అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుంది.

పది సంవత్సరాల క్రితం తను మెడిసిన్ చదివే రోజుల్లో కలం స్నేహం చేసే హాబీ ఉండేది. ప్రకాష్.... వైజాగ్‌లో బాంక్‌లో ఉద్యోగంచేసే అతనితో కలంస్నేహం చేసింది. మొదట్లో ఎంతో హుందాగా, ఎన్నో విషయాల గురించి రాసేవాడు. తర్వాత కొంచెం సన్నిహితంగా రాసేవాడు. తనూ కొంచెం దగ్గరైంది ఉత్తరాల ద్వారా.

ఫోర్త్ ఇయర్ చదివేటప్పుడు కుమార్‌తో పెళ్ళి సెటిలయ్యింది. ఈ విషయం తన కలం స్నేహితులకు తెల్పుతూ శుభలేఖలు పంపింది.

ప్రకాష్ నుండి రిప్లై వచ్చింది. "జానకీ, నిన్ను నేను మనసారా ఇష్టపడ్డాను. కలం స్నేహంలో ఈ విషయం తెల్పడం సభ్యత కాదని స్వయంగా వచ్చి నా మనస్సు నీకు తెలుపుదామని అనుకున్నాను. కానీ ఈలోగా నీ పెళ్ళి కుదిరింది. ఇప్పుడింక నేనేమీ చేయలేని నిస్సహాయుడిని. నీ వైవాహిక జీవితం నవనవోన్మేషం కావాలని నేను మనస్ఫూర్తిగా నిన్ను దీవిస్తున్నాను. నీ స్నేహితుడు ప్రకాష్.

పరీక్షలవగానే పెళ్ళి జరిగిపోయింది. భర్త కిష్టంలేని కారణంగా కలం స్నేహాలన్నీ వదిలేసింది. అలాగే కాలగమనంలో అన్నీ స్నేహాలు మరచిపోయింది.

పదేళ్ళు గడిచిపోయాయి. తనకు డాక్టరుగా పేరు ప్రఖ్యాతులు, డబ్బు, హోదా అన్నీ చేకూరాయి.

డాక్టర్ జానకి ఆలోచనల నుండి తేరుకొని వర్తమానంలోకి వచ్చింది. అయితే ఈ ప్రకాష్ ఎవరూ? అతనేనా ఊరు, పేరు, ఉద్యోగం సరిగ్గా అన్నీ అవే.

"వీల్లేదు. ఒకనాటి ప్రాణ స్నేహితుడు ప్రకాష్‌ను ఒక క్యాన్సర్ రోగిగా ఊహించలేదు" జానకి తీవ్రంగా ఆలోచిస్తోంది.

"ఆ ప్రకాష్, ఈ ప్రకాష్ ఒకడేనా?" కాకుంటే బావుండునని మనసులో అనుకుంట నడుస్తోంది జానకి.

ఎందుకో ప్రకాష్ విషయంలో డాక్టర్ జానకికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలనిపించింది. నాలుగు రోజుల తర్వాత ఒకరోజు వీలు చూసుకుని అతన్ని అడిగింది.

"పదేళ్ళ కిందట.... మీరు ఎవరితోనైనా కలంస్నేహం చేసేవారా?" అని అడిగింది డాక్టర్ జానకి.

అతనికికూడా విషయం అర్థమైనట్లుంది.

"ఆ జానకి మీరేనా?" అని అడిగాడు.

"అవును" అంది డాక్టర్ జానకి.

ప్రకాష్ నిట్టూర్చాడు.



"అప్పట్లో మీరు మరెవర్నో పెళ్ళిచేసుకుంటున్నారని లెటర్ రాసినప్పుడు చాలా ఫీల్ అయ్యాను.... కొన్నాళ్ళదాకా బాధపడ్డాను.

కానీ ఇప్పుడు చాలా సంతోషిస్తున్నాను. ఈ అర్థాయుష్కుడ్ని ఎన్నుకోనందుకు...."

"నో నో, ప్రకాష్.... రిపోర్టునుబట్టి చూస్తే పెద్దగా భయపడాల్సిందేంలేదు. కొన్నాళ్ల ట్రీట్‌మెంట్ తీసుకుంటే సరిపోతుంది...." అంది జానకి.

"ఆ ట్రీట్‌మెంట్ మీరు ఇస్తున్నారుగా బట్టి త్వరలోనే కోలుకుంటాను..... మళ్ళా అప్పుడప్పుడు మీ దగ్గర చెకప్ చేయించుకోవటానికైనా కొన్నాళ్ళు బ్రతుకుతాను...." అన్నాడు ప్రకాష్.

చాలా రోజుల తర్వాత జానకి తృప్తిగా నవ్వుకుంది. తెలియకుండానే ఆమె మనసు ఎంతగానో సంతోషించింది.

కమల వక్కలంతం
ఇం. నెం. 11-3-329
న్యూ మల్లేపల్లి
హైదరాబాద్-500 001